అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన

ప్రజాపాలన ప్రచార కళా యాత్రను ప్రారంభించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపాలన ప్రచార కళా యాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబర్ 20 : ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రజా పాలన ప్రచార కళా యాత్ర కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో మంగళవారం నుంచి ప్రజా పాలన-విజయోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ఈ విజయోత్సవాలు కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రజా పాలన విజయోత్సవాల ప్రచార కళా యాత్ర వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలోని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు నేటి నుంచి డిసెంబర్ 7 వరకు ప్రతిరోజూ మూడు మేజర్ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలు కళా ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహించనున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గ్రామ, మున్సిపల్ వార్డుల్లో విస్తృతంగా టీఎస్ఎస్ కళాకారులు తమ ఆటా పాటల ద్వారా అవగాహన కల్పించడమే ఈ కళా యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో కళాకారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పాటలు పాడుతూ ప్రజా కళా యాత్రను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో కృష్ణవేణి, సాంస్కృతిక శాఖ కళాకారుల బృందం, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- భారత రక్షణ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్ సతీశ్‌రెడ్డి
- గురునానక్ విశ్వ విద్యాలయంలో డిఫెన్స్ స్పేస్ అంశంపై జాతీయ సదస్సు

అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గురునానక్ వైస్ చైర్మన్ కోహ్లీ, ముఖ్య అతిథి సతీశ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 20: యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, డీఆర్‌డీవో మాజీ చైర్మన్, భారత రక్షణ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్ సతీశ్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విశ్వ విద్యాలయంలో బుధవారం డిఫెన్స్ స్పేస్ కన్వెన్షన్-2024 అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును భారతరత్న అబ్దుల్‌కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ సౌజన్యంతో దేశంలోని యువతకు డిఫెన్స్, స్పేస్ రంగాల్లో మంచి అవకాశాలపై ప్రేరణ కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిఫెన్స్ రంగాల్లో నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. యువతలో దేశభక్తి, నైపుణ్యం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. వర్క్‌షాప్, సెమినార్లు వారిని భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది దేశానికి ఉపయోగపడే పరిశోధనలు చేసే దిశగా ఉపయోగపడతాయన్నారు. యువతలో శాస్త్ర టెక్నాలజీ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో భవిష్యత్తులో నా యకులుగా ఎదగడానికి కావాల్సిన సామర్థ్యా లు విద్యా అవకాశాలను అందించడమే లక్ష్యమన్నారు. యువత శక్తివంతమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి కళాశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించ డం అభినందనీయమన్నారు. కార్యక్రమం లో కళాశాల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎస్ షైనీ, ప్రోగ్రాం డైరెక్టర్ రాజాసింగ్, కళాశాల అధ్యాపకులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం వద్దు

- భవిష్యత్తు 30 ఏండ్ల అవసరాలు తీర్చేలా..
- ట్రంక్‌లైన్ల నిర్మాణాలు ఉండాలి
- జలమండలి అధికారులతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

జలమండలి అధికారులతో చర్చిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 20 : రాబోయే 30 ఏండ్ల అవసరాలకు సరిపోయే విధంగా ట్రంక్ లైన్ల నిర్మాణాలను అనుసంధానం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థలను కల్పించే దిశలో అధికారులు పని చేయాలన్నారు. భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రంక్‌లైన్లను నిర్మించి వాటిని అనుసంధానం చేయాలన్నారు. జలమండలి పనుల్లో ఎలాంటి అలసత్వం లేకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజ్‌గోపాల్, మేనేజర్ వాహిని తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వేంకటేశ్వర్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

తాండూరు, నవంబర్ 20: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతున్నదన్నారు. 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు 18 శాతమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. బీసీల జనాభాకు తగినట్లు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగం లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు.

సర్దార్‌నగర్‌ను సందర్శించిన ఒడిశా బృందం

సర్దార్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవల వివరాలు తెలుసుకుంటున్న ఒడిశా ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం

- గ్రామంలో పల్లెప్రగతి పనులు పరిశీలన
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టి అభివృద్ధి పనులు బాగున్నాయని కితాబు

షాబాద్, నవంబర్ 20: మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని ఒడిశా ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఒడిశా బృందం సభ్యులు.. గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఆన్‌లైన్ సేవలు, రికార్డుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి, సొంత నిధుల సేకరణ, రాష్ట్ర ప్రభుత్వ నిధుల నిర్వహణ, ఉపాధి హామీ నిధులతో పల్లెప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పల్లెప్రకృతివనం, కంపోస్ట్ యార్డు, వైకుంఠధామం, హరితహారం నర్సరీ తదితర వాటిని పరిశీలించారు. ఈ గ్రామంలో అభివృద్ధి పనులు ఎంతో బాగున్నాయని ఒడిశా బృందం సభ్యులు కితాబిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పలు రకాల అభివృద్ధి పనులతో రాష్ట్ర స్థాయిలో రంగారెడ్డి జిల్లాలోనే సర్దార్‌నగర్ గ్రామం మాడల్ విలేజ్‌గా ఎంపికైనట్లు స్థానిక అధికారులు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో ఒడిశా బృందం అధికారుల బృందం సీఈవో అనిల్‌కుమార్, జిల్లా శిక్షణా అధికారి రుద్రయ్య, శ్రీనివాస్, షాబాద్ ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కవిత, శంకర్, రమేశ్, ఏపీవో వీరాసింగ్, మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ క్వారీ పనులు పరిశీలన



క్వారీని తిలకిస్తున్న సురేంద్ర మోహన్, విష్ణువర్ధన్‌రెడ్డి

కందుకూరు, నవంబర్ 20 : రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్ పరిధిలోని మైనింగ్ క్వారీలను బుధవారం మైనింగ్ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేంద్రమోహన్, టీజీ ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. గతంలో మీర్‌ఖాన్‌పేట్ సర్వే నంబర్ 112లో మైనింగ్ క్వారీలకు 55 ఎకరాలు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో ఆ సర్వే నంబరులోని మొత్తం విస్తీర్ణాన్ని టీజీ ఐఐసీకి కేటాయించింది. అందులో భాగంగా నిబంధనల ప్రకారం తవ్వకాలు తదితర పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్వారీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తవ్వకాలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, జిల్లా అధికారులు తహసీల్దార్ గోపాల్ ఉన్నారు.

అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలి

జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

నాగసముందర్‌లో కంపోస్టు షెడ్‌ను పరిశీలిస్తున్న వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ, ఎంపీవో షఫీఉల్లాఖాన్

ధారూరు, నవంబర్ 20: గ్రామ, మండల స్థాయి అధికారులు పల్లెల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సూచించారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం, కంపోస్టు షెడ్, నర్సరీ, వైకుంఠధామాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే రోగాలు దరి చేరవన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం సరిగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి అనంత్ రాజారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పంచాయతీ అధికారి ఫఫీఉల్లా ఖాన్‌కు పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలి

గ్రంథాలయ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్ రెడ్డి తదితరులు

బడంగ్‌పేట, నవంబర్ 20 : విద్యార్థులు చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ 57వ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బడంగ్‌పేటలో బుధవారం నిర్వహించారు. గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్‌తో కలిసి చైర్మన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదువుకొని జ్ఞానాన్ని సంపాదించి సమాజానికి అందించాలని సూచించారు. సమాజంలో మార్పు పుస్తకాల ద్వారానే సాధ్యం అవుతుందని ఆయన పేర్కొన్నారు. పాఠకుల అభిప్రాయాలకు అనుగుణంగా అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయాలలో చదువుకున్న వారు చాలా గొప్ప స్థాయిలో ఉన్నారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం ఉద్యోగులు యాదయ్య, సత్యనారాయణ, జైహింద్, శరత్ తదితరులు ఉన్నారు.

బీసీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు..

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 20: క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులే.. చదువులోనూ రాణిస్తున్నారని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కళాశాల అసోసియేట్ డీన్ డా. నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్ కళాశాల క్రీడల్లో భాగంగా రెండవ రోజు బుధవారం వర్సిటీ పరిధిలోని క్రీడామైదానంలో క్రీడలు ఉత్సాహంగా కొనసాగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చురుకుగా తనకు ఆసక్తి గల క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల మధ్య స్నేహభావం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. చక్కని ప్రతిభను కనబర్చిన విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపిక అయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థి ప్రతిభ, సృజనాత్మకతను కనబర్చేందుకు ఇది మంచి అవకాశమని యూనివర్సిటీ అబ్జర్వర్, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ డా.సురేశ్ అన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గల 11 కళాశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 460 మంది పాల్గొన్నారు. క్రీడలు రెండో రోజు సాయంత్రం ముగిసేసరికి వాలీబాల్ రాజేంద్రనగర్, ఫుట్‌బాల్ అశ్వరావుపేట, టెన్నికాయిట్ జగిత్యాల జట్లు సెమీ ఫైనల్‌కు చేరినట్లు ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ డా.సురేశ్ తెలిపారు.

లగచర్ల ఘటన దురదృష్టకరం



మీడియాతో మాట్లాడుతున్న త్రిసభ్య కమిటి ప్రతినిధి ఎంపీ మల్లు రవి

వికారాబాద్/కొడంగల్, నవంబర్ 20 : కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో జరిగిన ఘటన దురదృష్టకరమని త్రిసభ్య కమిటీ ప్రతినిధి ఎంపీ మల్లు రవి తెలిపారు. బుధవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను లగచర్ల ఘటనపై కాంగ్రెస్ త్రిసభ్య కమిటీ సభ్యులు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంచలనంగా మారిన లగచర్ల ఘటనలో నిజానిజాలను తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామన్నారు. కాంగ్రెస్ త్రిసభ్య కమిటీ ప్రతినిధి కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో త్రిసభ్య కమిటీ వేశామన్నారు. లగచర్లలో జరిగిన వాస్తవ పరిస్థితులపై ఎస్పీ, కలెక్టర్‌తో సమావేశమై మాట్లాడినట్లు తెలిపారు. లగచర్లతో పాటు గ్రామం అనుబంధ గ్రామాలైన రోటి బండ తండాతో పాటు మరో గ్రామాన్ని పర్యటించి అక్కడున్న రైతులతో మాట్లాడి నిజాలను తెలుసుకుంటామన్నారు. అధికారులు అభివృద్ధి కోసం భూసేకరణకు సంబంధించి, రైతులతో సమావేశం కోసమే వెళ్లారని.. దీనిని వ్యతిరేకించడం తగదన్నారు. వికారాబాద్ జిల్లాలో కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. విద్యార్థుల కోసం ఇటీవల మెస్ చార్జీలు కూడా పెంచినట్లు గుర్తు చేశారు. ఇలాంటి అభివృద్ధి పనులు చేస్తున్న ప్రభుత్వాన్ని ఇతర పార్టీల వారు వ్యతిరేకించడం తగదని అన్నారు.తాము ప్రత్యక్షంగా గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి నిజా నిజాలు తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొడంగల్ లోనూ వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.

రోదనల మధ్య కూల్చివేత

- నాలుగంతస్తుల భవనం నేలమట్టం చేసిన డీఆర్ఎఫ్
- సర్వం కోల్పోయి రోడ్డున పడ్డామంటూ యజమానుల కన్నీరు

సిటీబ్యూరో/కొండాపూర్, నవంబర్ 20 : కొండాపూర్ సిద్ధిక్‌నగర్‌లో పక్కకు ఒరిగిన భవనాన్ని అధికారులు నేలమట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భవనం చుట్టు పక్కల ఉన్న ఇండ్ల లోని నివాసితులను తొలుత ఖాళీ చేయించారు. బిల్డింగ్ యజమానికి జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చి.. భారీ పోలీసు బందోబస్తు మధ్య బుధవారం ఉదయం కూల్చివేత మొదలుపెట్టి.. అర్ధరాత్రి ముగించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో హైడ్రాకు చెందిన భారీ యంత్రం సహాయంతో కూల్చివేత పనులు చేపట్టారు. మధ్యాహ్న సమయంలో భారీ యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తగా..మూడు గంటల పాటు కూల్చివేతల ప్రక్రియ తాత్కాలికంగా నిలిపి వేసి ఆ తర్వాత మరమ్మతులు జరిపి యంత్రంతో మళ్లీ కూల్చివేతలు జరిపారు. సెక్షన్ 124, 324ల కింద జీహెచ్ఎంసీ అధికారులు మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత యాజమానిపై ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగింది?

శేరిలింగంపల్లి సర్కిల్ -20 పరిధి కొండాపూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్ బస్తీలోని 1639 ప్లాట్‌లో నాలుగంతస్తుల భవన నిర్మాణం ఉన్నది. దానికి ఆనుకొని ఉన్న ఖాళీ ప్లాట్లయిన 1605, 1638లలో సిల్ట్+2 అంతస్తుల పర్మిషన్‌తో సదరు యజమాని నిర్మాణ పనులు చేపట్టారు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా పుట్టింగుల నిమిత్తం భారీ గుంతలు తీశారు. దీంతో పక్కనే ఉన్న భవన పిల్లర్లు బయటకు వచ్చి, ఒక వైపు ఒరిగింది. పుట్టింగులపై ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో భవనం ఒక్కసారిగా భూకంపం వచ్చిన మాదిరిగా ఒరిగిపోవడంతో అందులో అద్దెకుంటున్న జనాలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. బిల్డింగ్ పూర్తిగా ఒక వైపునకు ఒరగడంతో స్థానికంగా చుట్టు పక్కల ఇండ్లలోని నివాసితులు భయాభ్రాంతులకు గురై జీహెచ్ఎంసీ, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు ఒరిగిన భవనంతో పాటు దాని చుట్టు పక్కల ఉన్న నివాసితులు ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఒరిగిన భవనాన్ని పరిశీలించి, కూల్చి వేసేందుకు నిర్ణయించారు. గురువారం ఉదయాన్నే హైడ్రాకు చెందిన భారీ యంత్రాన్ని ఒరిగిన భవనం వద్దకు తీసుకు వచ్చి కూల్చివేత పనులు మొదలుపెట్టారు. అయితే భవనంలో వంట గ్యాస్ సిలిండర్లు ఉండటంతో కూల్చివేత పనులు నెమ్మదిగా కొనసాగించారు. దీంతో పాటు పక్కనే ఉన్న మరో భవనానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఒరిగిన బిల్డింగ్‌ను ఉన్న చోటనే నేలమట్టం చేసేలా పనులు సాగించారు. కూల్చివేత పనులు సాగుతున్న సమయంలో అటుగా స్థానిక ప్రజలు, అద్దెకుంటున్న వారు ఎవరినీ రాకుండా నలువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పిన భారీ ప్రాణనష్టం

గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్తులతో ఉన్న ఆ భవనంలో మొత్తం 8 పోర్షన్లలో 48 మంది అద్దెకు ఉంటున్నారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హోటల్‌లో పని చేస్తున్న వారు, ఇతర ప్రైవేట్ జాబ్‌లు చేసుకునే వారు ఉన్నారు. ఎక్కువ శాతం అసోం, మణిపూర్‌కు చెందిన చిరుద్యోగులు ఉన్నారు. కాగా భయాందోళనతో కట్టుబట్టలతో బయటకు పరుగులు తీసిన వారు, వారికి సంబంధించిన సెల్ ఫోన్లు, సర్టిఫికెట్లు, ల్యాప్‌టాప్‌లు, విలువైన వస్తువులు, నగదులు ఇంట్లోనే ఉండిపోయాయి. వాటిని తీసుకునే ప్రయత్నం చేసినా.. పోలీసులు భవనంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. గురువారం ఉదయాన్నే భారీ యంత్రంతో కూల్చివేస్తుంటే అద్దెకున్న వారు తమ విలువైన వస్తువులను తెచ్చుకుంటామని పోలీసులను వేడుకున్నా.. ప్రాణపాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అనుమతించలేదు. కాగా, అర్ధరాత్రి నుంచి ఒరిగిన బిల్డింగ్ ఎటు వైపు కూలుతుందోనని చుట్టు పక్కల ఉన్న భవనాల యజమానులు, అందులో నివాసముంటున్న వారు కంటి మీద కునుకు లేకుండా రాత్రంగా గడిపారు.

కండ్ల ముందే నేలమట్టం..

'కాయా కష్టం చేసి కూడబెట్టుకున్న డబ్బులతో పాటు ఉన్న పొలం అమ్మగా వచ్చిన సొమ్ముతో ఇల్లు కట్టుకున్నాం. సొంతింటి కల నెరవేరడంతో పాటు ఎంతో కొంత ఆసరగా అద్దెలు వస్తాయని, పిల్లల భవిష్యత్‌కు భరోసా ఉంటుందన్న గంపెడాశతో కట్టుకున్న ఇల్లు కండ్ల ముందే నేలమట్టమవుతుంటే భరించలేకపోతున్నాం' అని ఇంటి యజమానులు లక్ష్మణ్, స్వప్న దంపతులు రోదించిన తీరు అందరి హృదయాలను కలచివేసింది. చేయని తప్పుకు తమకు తీరని నష్టం వాటిల్లడంతో పాటు తమ కుటుంబం రోడ్డుపైకి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణం కోసం అడ్డగోలుగా తవ్విన పిల్లర్ల గుంతల వల్లే తమ బిల్డింగ్ కూలిపోయే పరిస్థితి వచ్చిందని, అతని ద్వారానే మాకు న్యాయం జరిగేలా చూడాలంటూ అధికారులను వేడుకున్నారు.

తలా పాపం తిలా పిడికెడు

కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో 50 నుంచి 100 గజాలలోని స్థలంలో 5 నుంచి 6 అంతస్తులకు మించకుండా భవన నిర్మాణాలు చేస్తున్నారు. వీటిని హాస్టళ్లకు, ఓయో రూంలకు అద్దెకిస్తూ యజమానులు లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి, 'మీరు కట్టుకోండి మీ వెనకాల మేముంటామం'టూ అనధికారంగా అండగా నిలుస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుపెట్టుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులు కోట్లకు పడగలెత్తారు. అక్రమ నిర్మాణాలతో అనుకోని పరిస్థితుల్లో అగ్నిప్రమాదం సంభవించిన ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ కూడా చేరుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఓయోలో గంజాయి

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఓయో రూమ్ కేంద్రంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న వ్యక్తిని శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓయో రూంలో నిందితుడి వద్ద నుంచి రూ.లక్ష విలువ చేసే 4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ కథనం ప్రకారం...జమ్మూకశ్మీర్‌కు చెందిన పవన్‌కుమార్, సచిన్ కుమార్ నగరానికి వలస వచ్చి.. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యసనాలకు అలవాటు పడిన వీరు.. డబ్బుల కోసం గంజాయి విక్రయించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు గండిపేట లోని టీఎన్‌జీవో కాలనీలో ఉన్న ఓయో రూంలోని 205వ నంబర్ గదిలో గంజాయి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు ఓయో రూంపై దాడులు జరిపి పవన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు సచిన్ పరారీలో ఉన్నాడు.